క్లుప్తంగా

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనలు



బొత్సను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్,ఆల్ఫా కృష్ణ

విశాఖ విద్య: శాసనమండలి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ అభినందనలు తెలిపారు. శుక్రవారం నగరంలోని బొత్స నివాసంలో ఆయన్ను కలసి సత్కరించారు. నగరంలోని సమస్యలపై శాసన మండలిలో చర్చించాలని వారు బొత్సను కోరారు.

జూనియర్ వైద్యులకు మద్దతు

- నేడు ప్రభుత్వ వైద్యుల నిరసన

మహారాణిపేట : దేశం యావత్తు తలదించుకునేలా పీజీ డాక్టర్‌పై జరిగిన అరాచకత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ దేశవ్యాప్త జూనియర్ డాక్టర్ల ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ సంఘీభావం తెలియజేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకాల శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. అలాగే జూనియర్ డాక్టర్ల ఉద్యమానికి సంఘీభావం తెలియజేస్తూ శనివారం నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరు కావాలన్నారు. దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు, పీజీ విద్యార్థులు, డాక్టర్లు అత్యవసర పరిస్థితిని కూడా బహిష్కరించి ఉద్యమం చేస్తున్న వేళ ప్రభుత్వ డాక్టర్లు ఎటువంటి ఆందోళనలు చేయకుండా పేద రోగుల చికిత్సకు పూర్తిగా సహకరించాలని అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకుందన్నారు. తమ అసోసియేషన్‌తో సంబంధం లేని కొంత మంది వ్యక్తులు ఉనికి కోసం ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ పేరుతో బాధ్యతారాహిత్యంగా గంట పాటు విధులు బహిష్కరించి ధర్నా చేయాలని పిలుపునివ్వడం చట్టరీత్యా నేరమని, అలా పిలుపునిచ్చిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

నేడు ఉక్కు ఆస్పత్రిలో సేవలు బంద్

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో శనివారం సేవలు నిలిచిపోనున్నాయి. కోల్‌కతాకు చెందిన ఆర్‌జీకే ఆస్పత్రి జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం సంఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) శనివారం వైద్య సేవలు నిలిపి వేయాలని పిలుపు నిచ్చింది. ఆ పిలుపు మేరకు ఆస్పత్రిలో ఓపీడీ, రక్త పరీక్షలు, స్కానింగ్‌లు నిలిచిపోతాయి. అత్యవసర కేసులను మాత్రమే క్యాజువాల్టీలో వైద్యులు చూస్తారని ఆస్పత్రి వర్గాలు తెలిపారు.

డీఎస్సీలో సీఆర్పీలకు వెయిటేజీ ప్రకటించాలి

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ-24లో సమగ్ర శిక్షలో పని చేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ కల్పించాలని ఉద్యోగుల జిల్లా జేఏసీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కంచరపాలెం బీఎస్‌ఆర్ భవనంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విశాఖ జిల్లా జేఏసీ ప్రతినిధులు పి.గణపతి, లంక చైతన్య శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీఈడీ, టెట్ పరీక్షలు పాసై సమగ్ర శిక్షలో 12 ఏళ్లుగా చాలీచాలనీ జీతాలతో ఉద్యోగాలు చేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ ఇచ్చి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం ఆటోనగర్‌కి చెందిన వి.రమేష్‌బాబు రూ. 2 లక్షల 1,116 విరాళం అందజేశారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో అన్నప్రసాద పథకం జూనియర్ అసిస్టెంట్ కాశయ్యకి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

భయపెడుతున్న స్పీడ్ బ్రేకర్లు!

- అదుపుతప్పుతున్న ద్విచక్ర వాహనదారులు
- తొలగించాలని డిమాండ్



శ్రీహరిపురం గణేష్ మందిరం లైన్ వద్ద ఎత్తుగా వేసిన స్పీడ్ బ్రేకర్

మల్కాపురం: నిబంధనలకు విరుద్ధంగా ఎవరికి నచ్చినట్టు వారు వీధుల్లో స్పీడ్ బ్రేకర్స్ వేసుకుంటున్నారు. వీటిని గుర్తించలేని ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల పాలవుతున్నారు. ఈ సమస్యపై జీవీఎంసీ అధికారులు స్పందించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం కొత్తరామాలయం వీధి,గణేష్ మందిరం వీధి,జీవీఎంసీ పాఠశాల లైన్, జవహర్‌నగర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కొంత మంది వీధుల్లో అనధికారికంగా స్పీడ్ బ్రేకర్లు వేసుకున్నారు.నిజానికి స్కూల్ జోన్ ప్రాంతాలు, రెండు లైన్లు లేదా నాలుగు లైన్లు రోడ్డు ఉండే జంక్షన్ వద్ద, దేవాలయాలు, జీబ్రాలపై వృద్ధులు, పాదచారులు రోడ్డు దాటే వారికి ఇబ్బంది లేకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తారు. అది ట్రాఫిక్,జీవీఎంసీ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.

ఇష్టాను సారంగా బ్రేకర్ల ఏర్పాటు

కొంత మంది ఎలాంటి అనుమతులు తీసుకోకుండా తమ ఇంటి ముందు స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారు. అదీ నియమాలకు విరుద్ధంగా.. ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లు వేశారు. కనీసం వాటిని గుర్తించేలా నలుపు రంగులు,అలాగే రాత్రి వేళ గుర్తించే విధంగా రేడియం స్టికర్లు ఏర్పాటు చేయాలి. కానీ ఆ నిబంధనలు ఇక్కడ కానరావు. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారలు వీటిని గుర్తించ లేక అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

ప్రమాలు ఇలా..

గత వారం కొత్త రామాలయం వీధిలో ఓ వ్యక్తి తన తల్లిని ఆస్పత్రికి వైద్యం కోసం తీసుకెళ్తుండా స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి ఇరువురు గాయాలపాలయ్యారు. అలాగే ఇద్దరు యువకులు కూడా అదుపు తప్పి పడిపోయారు.



శ్రీహరిపురం కొత్త రామాలయం వీధి వద్ద స్పీడ్ బ్రేకర్

అధికారులు స్పందించాలి



శ్రీహరిపురం కొత్త రామాలయం వీధిలో పలు చోట్ల ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల ఇబ్బందికరంగా ఉంది. రాత్రి సమయంలో ఈ మార్గాన ద్విచక్ర వాహనంపై వస్తున్నప్పుడు గుర్తించ లేక అదుపు తప్పుతున్నాం.అనధికారికంగా స్పీడ్ బ్రేకర్స్ వేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి

– బంక నాగేశ్వరరావు, కొత్త రామాలయం వీధి

అదుపు తప్పుతున్నాం



గణేష్‌మందిరం వీధి,జీవీఎంసీ పాఠశాలతో పాటు జవహర్‌నగర సేవా మార్గం వద్ద స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా ఉన్నాయి.దీని వల్ల ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి చాలా మంది గాయాల పాలవుతున్నారు. గత వారం నేను స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి పడిపోయాను. వీధుల్లో ఇష్టానుసారం వేసిన స్పీడ్ బ్రేకర్లు తొలగించాలి.

– నూకరాజు, గణేష్ మందిరం వీధి

క్షణి కావేశంలో వివాహిత ఆత్మహత్య



అనూష మృతదేహం

గోపాలపట్నం: క్షణికావేశంలో బుచ్చిరాజుపాలెం దరి సీతారామరాజునగర్‌లో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. పి. అనూష(25) సీతారామరాజునగర్‌లో కుటుంబంతో నివాసముంటోంది. భర్త చెన్నైలో మేకప్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పిల్లలను అత్త కోసం టిఫిన్ తీసుకు రమ్మని పంపించింది. అయితే పిల్లలు వచ్చే సరికి ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందింది. స్థానికులు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు చేరుకుని వివరాలు సేకరించారు.

అత్తకు తెలియకుండా డబ్బులు వాడేశా..

మృతురాలి వద్ద సూసైడ్ నోట్ లభ్యమయింది. అత్తకు తెలియకుండా ఆమె ఖాతాలో రూ.90 వేలు వాడేశాను.. భర్త పలాసలో వివాహానికి హాజరయ్యేందుకు వస్తున్నారు.. డబ్బు గురించి అడిగితే సమాధానం చెప్పుకోలేను.. పిల్లలను నా తమ్ముడు చూసుకుంటాడు. నా చావుకు ఎవరూ కారణం కాదని లేఖలో పేర్కొంది.

భర్త ఇంటికి చేరుకునే లోగా శవమై..

మరో అరగంటలో భర్త వెంకటరమణ ఇంటికి చేరుకుంటాడన్న సమయానికి భార్య ఆత్మహత్య చేసుకోవడంతో లబోదిబోమని విలపించారు. నాన్నతో కలసి పెళ్లికి వెళ్దామని పిల్లలను ఉదయాన్నే లేపి వేగంగా తయారు కావాలని చెప్పింది. నానమ్మకూడా వస్తుంది. ఆమెకు టిఫిన్ తీసుకు రావాలని పంపింది. ఇంతలో పిల్లలను అనాథలు చేసే నిర్ణయం తీసుకుందని బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ప్రయివేటు పాఠశాలలో 1వ తరగతి, 5వ తరగతి చదువుతున్నారు. భర్త వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ చక్రధరరావు పర్యవేక్షణలో హెచ్‌సీ శివసాగర్ దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

1 నుంచి ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం

పెదగంట్యాడలో విస్తృత ప్రచారం



ట్రాఫిక్ నిబంధనల ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న న్యూపోర్టు ట్రాఫిక్ ఏఎస్‌ఐ ఉమామహేశ్వరరెడ్డి

పెదగంట్యాడ: వచ్చే నెల 1 నుంచి ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు చేయనున్నామని.. ఎవరు నిబంధనలు అతిక్రమించినా కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని న్యూపోర్టు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ ఉమా మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. జిల్లా భద్రతా కమిటీ చైర్మన్, కలెక్టర్ హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి సూచనల మేరకు నూతన ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం మండలంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా విధిగా హెల్మెట్ ధరించాలని, బీఐఎస్ మార్క్ ఉన్న హెల్మెట్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి జరిమానా విధించడంతో పాటు మూడు నెలలు పాటు లైసెన్స్ సస్పెండ్ చేస్తామన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయవద్దన్నారు. కారు నడిపే వారు సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడపరాదని, ప్రభుత్వం జారీ చేసిన నంబర్ ప్లేట్లనే వినియోగించాలని స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని చెప్పారు. అతి వేగంగా వాహనాల నడిపే వారితో పాటు జిగ్ జాగ్ డ్రైవింగ్ , రాంగ్ రూట్లో ప్రయాణం చేయవద్దని, సిగ్నల్ జంప్ వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపరాదన్నారు. అలాగే ఎక్కువ ధ్వని వచ్చే హారన్లు వినియోగించవద్దని అవగాహన కల్పించారు.

మైనింగ్ తవ్వకాలతో తీరని నష్టం

- ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి
- సీపీఎం కార్పొరేటర్ గంగారావు



కుసులవాడలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ పరిధిలో చిన్నయ్యపాలెం గ్రామాన్ని ఆనుకుని సర్వే నంబర్ 104 కొండపై మైనింగ్‌కు సిద్ధపడిన ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని 78వ వార్డు సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ గంగారావు డిమాండ్ చేశారు. మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ పంచాయతీలో శుక్రవారం ఆయన పాదయాత్ర ప్రారంభించారు. వి.ఆర్.ఇన్‌ఫ్రా టెక్నాలజీ సంస్థ చేపట్టనున్న మైనింగ్ కారణంగా కుసులవాడ ఎస్సీ కాలనీ, గొల్లలపాలెం, చిన్నయ్యపాలెం, రేగానిగూడెం, ఇచ్ఛాపురం, పందలపాక, బాకూరుపాలెం, జగన్నాథపురం గ్రామాలన్నీ విష ప్రభావానికి లోనవుతాయన్నారు. దుమ్ము, ధూళి కారణంగా ఐదు కిలోమీటర్ల పరిధిలో గాలి, నీరు, పంటపొలాలు నాశనం అవుతాయన్నారు. వరి, మామిడి, జీడి, కూరగాయలు, పువ్వుల పంటలు దెబ్బతింటాయన్నారు. భూగర్భ జలాలతో పాటు చుట్టూ చెరువులు పనికిరాకుండా పోతాయన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పూర్తిగా అనారోగ్యాల పాలయి కిడ్నీ, శ్వాసకోశ, ఊపిరితిత్తుల వ్యాధులకు గురవుతారన్నారు. కొండ చుట్టు పక్కల గ్రామాల ప్రజలంతా మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 28న జరుగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో వినతులు అందజేయాలన్నారు. స్థానిక నాయకులు ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పాదయాత్రలో భీమిలి జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, వాళ్ల నాగరాజు, డీవైఎఫ్ఐ నాయకుడు శిరువూరి శ్రీనివాసవర్మ, ప్రజానాట్య మండలి ప్రతినిధి పంపాన సూర్యనారాయణ, జోగ వెంకటరావు, కొయ్య గౌరి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ



సాకేతపురంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముర్రు వాణి

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు సాకేతపురంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి శుక్రవారం పరిశీలించారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు ఎన్నికల కోడ్‌తో నిలిచి పోవడంతో మళ్లీ పనులు సత్వరమే జరిగేలా జీవీఎంసీ అధికారులతో మాట్లాడినట్టు తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆమె కోరారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పిన్నింటి అప్పలరాజు, కన్వీనర్ అప్పు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



రాష్ట్ర మంత్రి సత్యప్రసాద్, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఉమా మహేశ్వరి

విశాఖ విద్య: జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కొత్తపాలెం జెడ్పీ హైస్కూల్ పదో తరగతి చదువుతున్న ఎం. ఉమా మహేశ్వరి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా ఉమా మహేశ్వరి ప్రశంసా పత్రం, మెమెంటో అందుకుంది. విద్యార్థినికి తోడ్పాటు అందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. రత్నమాలను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

రాఖీల సందడి

- ఈ నెల 19న రాఖీ పౌర్ణమి
- జోరుగా విక్రయాలు



పలు వెరైటీల్లో రాఖీలు

కంచరపాలెం: అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందడి ముందుగానే మొదలైంది. ఈ నెల 19 సోమవారం రాఖీపౌర్ణమి కావడంతో కంచరపాలెం, తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం పరిసర ప్రాంతాల్లో రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దూరప్రాంతాల్లో ఉన్నవారికి రాఖీలు పంపడానికి ఇప్పటికే చాలామంది కొనుగోలు చేశారు. మారిన కాలానికి అనుగుణంగా కొత్త రకం రాఖీలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. పెద్ద దుకాణాలతో పాటు ఫుట్‌పాత్‌లపై, అలాగే చిన్న చిన్న స్టాల్స్ వేసి రాఖీలు విక్రయిస్తున్నారు.



ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద రాఖీల అమ్మకాలు

శ్రావణ లక్ష్మీ నమోస్తుతే.

వైభవంగా వరలక్ష్మి పూజలు



మల్కాపురంలో పూజలందుకున్న శ్రావణలక్ష్మి

మల్కాపురం: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో మహిళలు వరలక్ష్మి పూజలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు.వేకువ జామున లేచి పిండి వంటలు వండారు. అనంతరం పూజా మందిరంలో లక్ష్మీ దేవిని నెలకొల్పి పలు రకాల పండ్లు, పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు.భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అలాగే ఐవోసీ చింతమణి దుర్గాగణపతి ఆలయంతోపాటు శ్రీహరిపురం హరిహర క్షేత్రం, హిమాచల్ నగర్ పెంటమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహించారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న షెడ్యుల్ కులాల సంక్షేమ సంఘం సభ్యులు

సింధియా: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ నగరం నడిబొడ్డున నిర్మించిన 125 అడుగుల నిలువెత్తు విగ్రహంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాలోకేష్ ప్రోద్బలంతోనే దాడి జరిగిందని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగడుగునా అద్భుతాలతో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తంతటి సంపత్, గుడాల బాబూరావు, గుడాల ఈశ్వరరావు, సిద్ధార్థ, హనుమంతరావు, గుడాల రాంబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో వ్యర్థాలు తొలగించరూ..


- దుర్వాసనతో అవస్థలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



జవహర్‌నగర్ రోడ్డు కుప్పలుగా వ్యర్థాలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డులోని పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. రోజుల తరబడి వ్యర్థాలు తరలించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈగలు, దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. వార్డు పరిధి పాత రామాలయం వీధి శివారు ప్రాంతంలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. అలాగే ఇదే వార్డు పరిధి జవహర్‌నగర్ సర్వీసు రోడ్డులో మూడు రోజుల నుంచి వ్యర్థాలు అలాగే ఉన్నాయి. ఇక్కడ సేవా మార్గంలో తొలగించిన చెట్ల కొమ్మలను వారం నుంచి వదిలేశారని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. ఈ మార్గంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు శానిటరీ సూపర్‌వైజర్ రాకపోకలు సాగిస్తుంటారని.. అయినా వారు స్పందించడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించాలని కోరుతున్నారు.

'మైనారిటీ సమితి' జిల్లా అధ్యక్షుడిగా అస్లం ఖాన్



అస్లం ఖాన్‌ను అభినందిస్తున్న సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారుఖ్ షుబ్లీ

సీతమ్మధార: రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా 14వ వార్డు సీతమ్మధారకు చెందిన మహ్మద్ అస్లం ఖాన్ నియమితుడయ్యారు. సీతమ్మధారలోని ఒక హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ ఫారుఖీ షుబ్లీ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో విశాఖలోని అన్ని నియోజకవర్గాలకు కొత్తగా అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమితి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అస్లం ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎంతో గౌరవ ప్రదమైన పదవిని కేటాయించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఫారుఖ్ షుబ్లీ, ముస్లిం పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం



సీసీ కెమెరాలో నమోదైన మృతుడి చిత్రం

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండం పంచాయతీ పరిధిలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని 25 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన యువకుడి మృతదేహాన్ని వీఆర్వో మంగరాజు, వీఆర్‌ఏ సింహాచలం గుర్తించారు. సత్రం జంక్షన్ నుంచి అడవివరం వెళ్లే రహదారిలో అశోక్‌నగర్ లేఅవుట్ సమీపంలో రహదారి పక్కన తుప్పల్లో ఈ మృతదేహం లభించింది. అతని శరీరంపై నలుపు రంగు నిక్కరు, తెలుగు, నీలం రంగు గళ్లు కలిగిన షర్టు ఉంది. ముఖం గుర్తించలేని విధంగా పాడయిపోయింది. వీఆర్వో ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్ఐ సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల గ్రామాల్లో విచారించారు. మూడు రోజుల కిందట అతను అడవివరం వైపు నడుచుకుని వెళ్లినట్టు స్థానికంగా ఓ వ్యక్తి తెలిపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై నేడు సదస్సు

మహారాణిపేట: మాదక ద్రవ్యాల నియంత్రణపై శనివారం జీవీఎంసీ జోనల్ 4 కార్యాలయం సమావేశ మందిరంలో మధ్యాహ్నం రెండు గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. జిల్లాకు చెందిన రిటైల్ కెమిస్టులు, డ్రగ్గిస్టుల పాత్రపై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, విశాఖ జిల్లా డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా ఔషధ నియంత్రణాధికారులతో పాటు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

35 కిలోల గంజాయి పట్టివేత

పెందుర్తి : కోయంబత్తూర్‌కు చెందిన గోవిందరాజు సత్యమూర్తి, చిత్రవేలు ఒడిశా నుంచి గంజాయి సేకరించి కిరండోల్ రైల్లో పెందుర్తి తీసుకొచ్చారు. వారు స్టేషన్‌లో రైలు దిగి పెందుర్తి వైపు వస్తున్న సమయంలో పెందుర్తి పోలీసులు కాపు కాసి వారిని పట్టుకుని 35 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎల్.రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.